క్లుప్తంగా

ఉర్లాం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



సమావేశంలో పాల్గొన్న రైల్వే అధికారి గణేష్ తపతి, కమిటీ సభ్యులు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం రైల్వే స్టేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని, పూరీ–తిరుపతి హాల్ట్ కల్పించాలని ఉర్లాం రైల్వే స్టేషన్ సలహా సంఘ కమిటీ విజ్ఞప్తి చేసింది. శనివారం స్టేషన్ ఆవరణలో రైల్వే కమర్షియల్ అధికారి గణేష్ తపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు డి.రాజశేఖర్, తదితరులు మాట్లాడుతూ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయాలని, బ్రిజ్‌లు ఏర్పాటు చేయాలని, స్టేషన్‌కు వచ్చే అప్రోచ్ రోడ్డును బాగుచేయాలని కోరారు. స్టేషన్ మాస్టర్ ఎల్.వి.శ్రీనివాస్, కమిటీ సభ్యులు చింతాడ మల్లేష్, వై.శ్రీనివాస్, బి.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణ అవసరం



అవగాహన కల్పిస్తున్న హిమబిందు

జలుమూరు: విద్యార్థినులకు స్వీయ రక్షణ చాలా అవసరమని వన్‌స్టాప్ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ వై.హిమబిందు అన్నారు. లింగాలవలస ఉన్నత పాఠశాలలో ఆడ పిల్లలను చదివిద్దాం – ఆడ పిల్లలను రక్షిద్దాం అన్న కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించారు. సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, గృహహింస, వరకట్న వేధింపులు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలను వివరించారు. విద్యార్థినులు, మహిళలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా 100, 1098, 181, 112 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. హెచ్‌ఎం ఉంగటి అప్పల సూర్యనారాయణ, బి.కవిత, ఉపాధ్యాయులు బమ్మిడి శ్రీనివాసరావు, జల్లు రమణమూర్తి, గార విశ్వనాథం, చింతాడ దమయంతి, డి.కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఏడీఏ మధుబాబు

పాతపట్నం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని వ్యవసాయశాఖ ఏడీఏ లింగాల మధుబాబు అన్నారు. స్థానిక ఏఎంసీ మైదానంలో శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏడీఏ ప్రారంభించారు. జాతీయ గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణ, రంగనాథన్ చిత్రపటాలకు రిటైర్డ్ ప్రొఫెసర్ తూలుగు తిరుపతిరావు, రిటైర్డ్ ఎంపీడీఓ చిరంజీవి నివాళులర్పించారు. ఎస్.మధుబాబు, నూలు బుజ్జి, పెద్దింటి అప్పారావు, బాబూరావు, హెచ్‌ఎం వైకుంఠరావు, కాళ్ల రాజు, బాబ్జీ, రాజశేఖర్, మోజేష్, పాఠకులు పాల్గొన్నారు.

పశుగణన పరిశీలన



పశుగణను పరిశీలిస్తున్న మురళీధర్

ఆమదాలవలస: పశుగణన చేయడం ద్వారా భవిష్యత్ ప్రణాళికలు, విధాన రూపకల్పనకు కీలకమైన సమాచారాన్ని అందిస్తోందని పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ఆర్.మురళీధర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి రెండో వార్డు కృష్ణాపురంలో శనివారం 21వ అఖిల భారత పశుగణన చేస్తున్న ఎన్యుమరేటర్స్‌తో కలిసి పశుగణన తీరును పరిశీలించి, వారికి అవగాహన కల్పించి తగిన సూచనలు, సలహాలిచ్చారు. ఇది పశుసంవర్ధక రంగానికి, పశుసంవర్ధక రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడేలా కార్యక్రమాలు సమర్థవంతంగా రూపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. నాలుగు రకాల ఇంటింటా సర్వేల గూర్చి వివరించారు. పాడి రైతులు అడిగిన సందేశాలను నివృత్తి చేశారు. నలుగురు ఎన్యూమరేటర్స్, సహాయ సంచాలకులు డాక్టర్ రోణంకి ఆనందరావు, స్థానిక ప్రాంతీయ పశువైద్య శాల సిబ్బంది పాల్గొన్నారు.

సభలు, సమావేశాలపై నిషేధం

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో రాజకీయ, మత, వివాహ సంబంధిత కార్యకలాపాలు, సమావేశాలను నిషేధించినట్లు రాష్ట్ర విద్యాశాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసిందని ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఇకనుంచి పాఠశాల సమయంలో గానీ, ముగిసిన తరువాత గానీ, సెలవు రోజైనా సభలు, సమావేశాలకు అనుమతి ఇవ్వొద్దన్నారు. ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు జరిగినట్లు తన దృష్టికి వస్తే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఇండోర్ స్టేడియం.. కల నెరవేరేనా?



గత ప్రభుత్వ హయాంలో దాదాపు పూర్తయిన ఇండోర్ స్టేడియం

- గత ప్రభుత్వ కాలంలో దాదాపు స్టేడియం పనులు పూర్తి..
- మరిన్ని సదుపాయాలకు కొత్త ప్రతిపాదనలు
- స్టేడియాన్ని త్వరగా ప్రారంభించాలని కోరతున్న క్రీడాకారులు

నరసన్నపేట: నియోజకవర్గం కేంద్రం నరసన్నపేటతోపాటు పరిసర గ్రామాల్లో క్రీడాకారులకు కొదవ లేదు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వివిధ క్రీడాంశాల్లో సత్తా చాటుతున్నారు. అరకొర సౌకర్యాలు ఉన్నప్పుడే ప్రతిభను చాటి నరసన్నపేట ఖ్యాతిని ఇనుమడింపజేస్తే.. పూర్తి సౌకర్యాలు కల్పిస్తే మరింతగా రాణించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంట్లో భాగంగానే నరసన్నపేటలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి 2018లో అప్పటి ప్రభుత్వం తరపున మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. అయితే పనులు ప్రారంభం కాలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నరసన్నపేట ఎమ్మెల్యే, రోడ్లు, భవనాలశాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ స్టేడియం పనులపై దృష్టి సారించారు. అప్పటికున్న ఎస్టిమేషన్ కాకుండా మరలా ఎస్టిమేషన్ వేయించి పనుల్లో వేగం పెంచారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు సాగకపోవడంతో 2022లో ఆయనను తప్పించి మరొకరికి బాధ్యతలు అప్పగించారు. దాదాపుగా పనులు పూర్తిచేశారు. చిన్న, చిన్న ముస్తాబులు చేసి ప్రారంభోత్సవం చేస్తామనగా.. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి.

కాలపయాపన..

స్టేడియం పనులు పూర్తయినా ఫ్లోరింగ్ ఆటలకు అనుగుణంగా లేదని, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, స్టేడియం చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాంచాలని, లోపల లైటింగ్ మార్పులు చేయాలని, వాకింగ్ ట్రాక్ నిర్మించాలని స్థానికులు కోరడంతో దానికి తగ్గట్టుగా మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. స్పోర్ట్స్ అథారిటీస్ చైర్మన్ నవంబర్ 3న స్వయంగా స్టేడియాన్ని పరిశీలించారు. అధికారులకు కొత్తగా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.

ఈ ఆటలకు అవకాశం..

ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయితే షటిల్ బాడ్మింటన్ ఆడటానికి నాలుగు కోర్టులు అందుబాటులోనికి రానున్నాయి. వాలీబాల్‌తోపాటు టేబుల్ టెన్నిస్ ఆడటానికి వీలు అవుతుంది. దీంట్లోనే ఒకవైపు వెయిట్ లిఫ్టింగ్ శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితోపాటు ఇండోర్ ఆటలన్నీ ఆడవచ్చు. ప్రస్తుత పాలకులు ఇచ్చిన హామీ మేరకు పనులు పూర్తిచేసి స్టేడియాన్ని అందుబాటులోనికి తీసుకురావాలని క్రీడాకారులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

ప్రహరీ నిర్మించాలి



స్టేడియం నిర్మాణానికి ఐదు ఎకరాలను నరసన్న చెరువులో కేటాయించడం జరిగింది. ప్రస్తుతం కొంత భాగంలోనే స్టేడియం నిర్మాణం జరిగింది. మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. ఇలాగే వదిలేస్తే ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఉంది. స్థలం అంతటినీ స్వాధీనం చేసుకొని ప్రహరీ నిర్మించాలి.

– గొద్దు చిట్టిబాబు, మాజీ సర్పంచ్, నరసన్నపేట

అందుబాటులోకి తీసుకువస్తాం



స్టేడియం పనులు దాదాపు పూర్తయ్యాయి. బ్యాడ్మింటన్ ఆడాలంటే ఫ్లోరింగ్ ఉడెన్‌తో ఉండాలి. లోపల లైటింగ్ తక్కువగా ఉంది. ప్రహరీ నిర్మించాల్సి ఉంది. వీటితోపాటు మరికొన్ని హంగుల కోసం కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. వచ్చే వేసవి కల్లా పనులు పూర్తిచేసి స్టేడియాన్ని అందుబాటులోకి తీసువస్తాం.

– శ్రీధర్, డీఎస్‌డీఓ

నిరుపయోగం



నరసన్నపేట మండల కేంద్రంలోని దేశవానిపేట పశువైద్య ఏడీ కార్యాలయ ప్రాంగణంలో రైతు శిక్షణ, విస్తరణ కేంద్రం పేరిట నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. ఆరేళ్ల క్రితం ఈ భవనాన్ని రూ.60 లక్షలతో నిర్మించారు. ఈ భవనం వినియోగంలో పోవడంతో కిటికీలు పాడువుతున్నాయి. స్లాబ్ పెచులు ఊడుతున్నాయి. పశువైద్యాధికారులు స్పందించి భనాన్ని వినియోగంలోనికి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

శిథిలావస్థ



ఈ చిత్రం పాతపట్నం మండలంలోని ఎస్.ఎస్.మనుగు జీసీసీ రేషన్ డిపో. లాబర, బైదలాపురం, ఎస్.ఎస్.మనుగు జీసీసీ రేషన్ డిపోలు శిథిలావస్థకు చేరాయి. పైకప్పు రేకులు పూర్తిగా పాడయ్యాయి. గోడలకు బీటలు వారాయి. చిన్నవర్షపు జల్లు కురిసినా గదుల్లోకి నీరుచేరి నిత్యవసర సరుకులు తడిసి ముద్దవుతున్నాయి. చాలా ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడం వల్లే ఈ దుస్థితికి చేరాయి. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి జీసీసీ డిపోలను బాగుచేయాలని గిరిజనులు కోరుతున్నారు.

– పాతపట్నం

రోడ్డు నిర్మించరూ..



ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేట నుంచి బసవరాజుపేట గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డుకు మోక్షం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సుమారు రెండు కిలో మీటర్లు పొడవు ఉన్న బసవరాజుపేట రోడ్డు గోతులమయంగా మారింది. వర్షా కాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఈ రోడ్డును బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

ఆదమరిస్తే అంతే..



కొత్తూరు మండలంలోని కడుము కూడలి వద్ద వారణాసి–పర్లాకిమిడి రోడ్డు మధ్యలో రంధ్రం ఏర్పడింది. వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం తప్పదు. ఈ రోడ్డులో నిత్యం భారీ వాహనాలతోపాటు బస్సులు తిరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే రంధ్రాన్ని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

– కొత్తూరు

భరతనాట్య పోటీల్లో ప్రతిభ



పురస్కారాన్ని అందుకుంటున్న స్నేహాంజలి

పొందూరు: ఈ నెల 14 నుంచి 16 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో అఖిల భారతీయ బాటిల్ స్పోర్ట్స్ సంఘ్ (ఏబీబీఎస్ఎస్) ఆధ్వర్యంలో జరిగిన జాతీయ భరతనాట్య పోటీల్లో జిల్లాకు చెందిన సనపల స్నేహాంజలి పాల్గొని కళాభవ్ పురస్కారం అందుకుంది. అయోధ్య ఫెస్టివల్‌లో భాగంగా జరిగిన జాతీయ పోటీల్లో ఈ పురస్కారం లభించిందని తల్లిదండ్రులు సత్యకుమార్, జ్యోతి శనివారం తెలిపారు. దేశవ్యాప్తంగా 293 మంది జూనియర్ విభాగంలో భరతనాట్య ప్రదర్శన చేయగా.. ఏపీ నుంచి నాట్య ప్రదర్శన ప్రత్యేక బహుమతిని గెలుచుకుంది. మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి చెందిన స్నేహాంజలి జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తేవడంతో తల్లిదండ్రులు, బంధువులు, సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, తాడివలస ఎంపీటీసీ సువ్వారి దివ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం స్నేహాంజలి ప్రస్తుతం శ్రీకాకుళంలోని ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది.

ఎస్‌ఎంసీ చైర్మన్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డీఈఓ తిరుమల చైతన్య

కొత్తూరు: పాఠశాలల అభివృద్ధిలో ఎస్‌ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్‌లే కీలకమని డీఈఓ తిరుమల చైతన్య అన్నారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో శనివారం ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన మండలంలోని 89 పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్‌లతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ కమిటీ చైర్మన్లు పాఠశాలలను ఎప్పటికప్పుడు సందర్శించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. చైర్మన్‌తోపాటు ప్రతీ సభ్యుడు సేవాభావంతో పని చేయాలన్నారు. వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంఈఓలు గోవిందరావు, శ్రీనివాసరావు, విద్యా విభాగాం నోడల్ అధికారి గోవిందరావు పాల్గొన్నారు.

అపార్ వేగవంతం చేయాలి..

అపార్ నమోదు వేగవంతం చేయాలని హెచ్‌ఎంలకు డీఈఓ సూచించారు. జిల్లాలోని 478 పాఠశాల్లో 3.28 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నట్లు చెప్పారు. ఇంతవరకు 1.48 లక్షల మంది విద్యార్థులకు అపార్ కార్డుల రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు.

కార్తీక దీపోత్సవం



కొత్తూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం కనుల విందుగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు దీపాలను వెలిగించారు. ఆలయ ప్రాధాన అర్చకుల వేద మంత్రాల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

– కొత్తూరు

ఆయుష్ వైద్య సేవలపై అవగాహన



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆశ వర్కర్లు

హిరమండలం: ఆయుష్ వైద్య సేవలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఆయుష్ వైద్యుడు పురుషోత్తం అన్నారు. హిరమండలం పీహెచ్‌సీలో జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలకు ఆయుష్ వైద్య సేవలపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్ వైద్యం ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. అధికంగా ఇంగ్లిష్ మెడిసిన్ వాడకం వల్ల రానున్న రోజుల్లో ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ ఆయుష్ వైద్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. అనంతరం శుభలయలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

జలుమూరు: మండలంలోని కరవంజ కాలనీ శివారులో నిర్వహించిన జూద శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ బి.అశోక్‌బాబు శనివారం తెలిపారు. రూ.7 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. జూద శిబిరం నిర్వహిస్తున్న అందిన సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు.

పోటెత్తిన భక్తులు



క్యూలో ఉన్న భక్తులు

జలుమూరు: శ్రీముఖలింగంలో కార్తీక మాసం మూడో శనివారం స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు దర్శనాలు చేశారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భీమేశ్వర, సోమేశ్వర ఆలయాల వద్ద భక్తుల రద్దీ కొనసాగింది. జిల్లా నలుమూలలతోపాటు విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

పాతపట్నం: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌కు సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పాడ్యమి పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అష్టోత్తర శతనామావళితో పూజలు చేపట్టారు. పాతపట్నం, కొరసవాడ, పరిసరాల ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన



- ప్రశ్నించేవారిపై తప్పుడు కేసులు
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో మంత్రి లోకేష్ తీసుకువచ్చిన రెడ్‌బుక్ పాలన సాగుతోందని, కూటమి నాయకులను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించే సోషల్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలపై తప్పుడు కేసులు పెట్టి గొంతు నొక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రశ్నించటమే నేరంగా మారితే రాష్ట్రంలో మరెవ్వరూ మాట్లాడలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కక్షపూరిత రాజకీయాలు చేయటం వలన మీకే నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయించి, జైల్లో వేసి రాష్ట్రాన్ని కూటమి నాయకులు దోచుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజలకు మేలు చేయాలను కుంటే మంచి మనస్సు ఉండాలన్నారు. అధికారం చేపట్టి ఐదు నెలలు అవుతున్నా.. మహిళలకు ఎందుకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించలేదని నిలదీశారు. ఉచిత ఇసుక విధానమని చెప్పి టీడీపీ నాయకులు దోపిడీకి తెరలేపారన్నారు. దీపావళి నుంచి ఇస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ అందరికీ అందటం లేదన్నారు. ప్రజలను మోసం చేయటం సీఎం చంద్రబాబుకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడి హయాంలో సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి, ఆయా తేదీల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తుచేశారు.

మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

నరసన్నపేట: జిల్లాలో 6 లక్షల మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు ఉన్నారని, రూ.600 కోట్లు పొదుపు నిర్వహిస్తున్నారని, ప్రతీ మహిళ కుటుంబం జీవన ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఎస్‌వీఈపీ, ఎంఈడీ, ఓఎస్‌ఎఫ్ మండలాల బ్లాక్ అధ్యక్షులు, ఏపీఎంలతో సమీక్ష నిర్వహించారు. స్వయం శక్తి సంఘాల్లో ఉన్న మహిళల్లో ఆసక్తి ఉన్న వారందరితో వ్యాపారాలు పెట్టించాలన్నారు. జీవనోపాధుల డీపీఎం నారాయణరావు, టెక్కలి, నరసన్నపేట ఏసీలు శ్రీరాములు, కొండలరావు మాట్లాడుతూ వ్యాపార ఆసక్తి కలిగిన మహిళలను గుర్తించి వారికి తగిన సూచనలు, అవసరమైన సపోర్టు ఇవ్వాలన్నారు. బ్యాంకులతో మాట్లాడి వారికి రుణాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌వీఈపీ ఏపీఎం మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ, టౌన్ ఫీడర్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టెక్కలి డివిజన్ ఈఈ జి.శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా విద్యుత్ స్తంభాలు, ఏబీ స్విచ్‌ల ఏర్పాటు, విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేపడతామన్నారు. హిరమండలం, పాతహిరమండలం, సుభలయ, నౌగూడ గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



గ్రామస్తులకు అవగామన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రవల్లిక

బూర్జ: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని స్థానిక ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక అన్నారు. మండలంలోని కంట్లాం పంచాయతీ లచ్చయ్యపేటలో శనివారం సత్ప్రవర్తనపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువకులు మంచిగా చదువుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. పెద్దలు పట్ల గౌరవవం, గ్రామస్తులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. మైనర్ డ్రైవింగ్ చట్టపరంగా నేరమన్నారు. పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారించాలి

పాతపట్నం: మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పి.మోహన్‌రావు, జి.కవీశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని ఎంఈఓ–1 పోస్టు ఖాళీ అయినప్పటికీ ఇంత వరకు నియమించలేదన్నారు. విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయ సమస్యలు పెండింగ్‌లో ఉండడం వల్ల ఇబ్బంది పడుతున్నామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి చొరవ చూపి వెంటనే ఎంఈఓ–1 పోస్టును భర్తీ చేయాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సరుబుజ్జిలి: బ్యాంకుల లావాదేవీలు, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన ఉండాలని ఎస్ఎస్‌టీ మోటివేటర్ సి.హెచ్.వెంకటేష్ అన్నారు. మండలంలోని షళంత్రి సచివాలయం ఆవరణలో యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టీ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులదే కీలక పాత్ర

నరసన్నపేట: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని, దీంట్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కీలక పాత్ర వహించాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సబంధించిన జీపీడీపీపై శిక్షణ సమావేశం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు ఏలా తయారు చేయాలో వివరించారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ఆమదాలవలస: సైబర్ మోసాల పట్ల యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్ సూచించారు. శనివారం సాయంత్రం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు తిమ్మాపురంలో అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు, గంజాయి రవాణా, ఖైనీ, గుట్కా అమ్మకాలు, తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.